

క్లుప్తంగా

'అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు'

పోరుమామిళ్ల: అడవులకు నిప్పు పెట్టడం వల్ల మానవాళికి ముప్పు ఏర్పడుతుందని రేంజర్ రఘునాథరెడ్డి అన్నారు. శనివారం వేసవి కాలంలో అడవిలో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించడంపై అటవీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఎర్రచందనం అక్రమ రవాణా, అడవులకు నిప్పు పెట్టడం, వన్యప్రాణులను వేటాడటం తదితర కార్యక్రమాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

కాలువలో పడి యువకుడి మృతి

చాపాడు: మండల పరిధిలోని ఓబుళరెడ్డిపేట గ్రామంలో శనివారం సాయంత్రం కాలువలో పడి పాలగిరి నాగసుబ్బారెడ్డి (35) అనే యువకుడు మృతి చెందాడు. పాలగిరి సుబ్బారెడ్డి కుమారుడైన నాగసుబ్బారెడ్డి చిన్న వయస్సు నుంచి మూర్ఛ వ్యాధితో బాధపడేవాడు. శనివారం సాయంత్రం గ్రామంలో తిరుగుతూ ప్రమాదశాత్తు నాగసుబ్బారెడ్డి కాలువలో పడ్డారు. ఆ సమయంలో మూర్ఛ రావడంతో ఊపిరాడక మృతి చెందాడు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు క్రైం : న్యాయవాదుల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రామచంద్రారెడ్డి తెలిపారు. సి.సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా పి.రామచంద్రారెడ్డి వైస్ ప్రెసిడెంట్‌గా వై.శ్రీనివాసులు రెడ్డి, సెక్రటరీగా పి.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీగా జి.రాజేష్‌రెడ్డి, ట్రెజరర్‌గా ఎస్.అంజాద్ బాషా, మహిళా సెక్రటరీగా పి.అంకమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. న్యాయవాదులు ముడిమెల కొండారెడ్డి, జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

పోరుమామిళ్ల: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ముస్లింలకు శనివారం ఎంపీటీసీ కలువకూరి రమణ రంజాన్ తోఫా పంపిణీ చేశారు. స్థానిక శ్రీరామచంద్రా రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో నిత్యావసర సరుకులు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి, కూటమి అభ్యర్థి రోశన్న అందజేశారు.

చేసిన పనులకు బిల్లులు చెల్లించండి

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మున్సిపల్ కమిషనర్‌తో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో వివిధ గ్రాంట్‌లలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు సకాలంలో చెల్లించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో పెండింగ్ పనులు, బిల్లులు, పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిల్ ఆమోదం పొంది టెండర్ల ద్వారా పనులు దక్కించుకుని చేపట్టిన కొన్ని పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని, వీలైనంత త్వరగా బిల్లులు చెల్లించేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో సంబంధిత వార్డు కౌన్సిలర్‌తో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వల్లెరవారిపల్లెలో కొన్ని నెలలుగా తాగునీటి సమస్య వేధిస్తోందని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో బద్వేలు మున్సిపాలిటీకి మంజూరైన రూ.130 కోట్ల నిధులలో దాదాపు రూ.26 కోట్ల నిధులు శ్మశానాల అభివృద్ధికి కేటాయించామని, ప్రస్తుతం ఆ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ఏమైనా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందా అని కమిషనర్‌ను అడుగగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

'కొండయ్యకు ఉపసర్పంచ్ పదవిని అడిగే అర్హత లేదు'

ప్రొద్దుటూరు : గోపవరం గ్రామ పంచాయతీకి చెందిన కొండయ్యకు ఉపసర్పంచ్ పదవిని అడిగే అర్హత లేదని గ్రామ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు ఓబయ్య యాదవ్ అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఒప్పందం మేరకు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, కొండయ్య కోడలు రమాదేవికి ఉప సర్పంచ్ పదవి ఇచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలో తమ పనులు కావడం లేదని, వ్యాపారిగా ఉన్న తాను వ్యాపారం చేసుకోకుండా నష్టపోతున్నారని తెలిపారన్నారు. దీంతో మాజీ సర్పంచ్ దేవీప్రసాద్‌రెడ్డి, తాను కలిసి ఎన్నికల సందర్భంగా ఖర్చు పెట్టిన రూ.38 లక్షలను కొండయ్యకు చెల్లించామని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఉపసర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరులో అభివృద్ధి పనులకు ఆమోదం

మున్సిపల్ సమావేశంలో ప్రవేశపెట్టిన ఎజెండా

మైదుకూరు : మైదుకూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశంలో అభివృద్ధి పనులపై చేసిన ఖర్చులను, చేపట్టనున్న అభివృద్ధి పనులకు తయారు చేసిన అంచనాలతో అజెండాను సభ్యులకు వివరించారు. ఇటీవల మున్సిపాలిటీలో బ్యూటిఫికేషన్ పేరుతో చేసిన పనులతో సహా 51 అంశాలతో ఉన్న ప్రధాన అజెండాను, 12 సీసీ రోడ్లు, డ్రైనేజీలతో ఉన్న అదనపు అజెండాను సభ్యులు ఆమోదించారు. కొద్ది రోజుల కిందట బస్టాండ్ గేట్, కూరగాయల మార్కెట్ రుసుం వసూలుకు నిర్వహించిన వేలంలో ఖరారు చేసిన హెచ్చు పాటలకు కూడా సభ్యులు ఆమోదం తెలిపారు.

నేడు, రేపు బకాయిలు చెల్లించవచ్చు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ప్రజలు ఈనెల 30వ తేదీ ఉగాది, 31వ తేదీ రంజాన్ పండుగల రోజుల్లో కూడా 2024–25 ఆర్థిక సంవత్సరానికి పన్ను బకాయిలను చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను బకాయిలు చెల్లించేందుకు మార్చి 31వ తేదీ వరకు గడువు ఉండటంతో ఆస్తి పన్ను బకాయిలో వడ్డీపై 50 శాతం రాయితీని ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని పురసేవలో ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు పన్ను చెల్లింపులు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలు దూరం

చాపాడు: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చునని ఎస్ఐ చిన్న పెద్దయ్య పేర్కొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శనివారం ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై ఆటోలు, టాక్సీ డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన దారులు రోడ్డు భద్రతను పాటించాలని ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదకరమని రూరల్ ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధిస్తామన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జమ్మలమడుగు రోడ్డులో ఉన్న వైఎస్ విగ్రహం వద్ద శనివారం సాయంత్రం వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై ఎస్ఐ అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

దువ్వూరు : వేసవిలో మండలంలోని ప్రజలకు తాగునీటికి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీఓ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో తాగునీటికి ఇబ్బంది ఉన్న గ్రామాలను గుర్తించాలన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయ బోర్ల ద్వారా ప్రజలకు తాగునీటిని అందించాలని అధికారులకు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ మాట్లాడుతూ మండలంలో 105 మంచినీటి స్కీంల ద్వారా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామన్నారు. వేసవి కాలం కావడంతో మండలంలోని కొన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని చెప్పారు. వ్యవసాయాధికారి అమరనాథ్ రెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణయ్య, హౌసింగ్ ఏఈ రమేష్ బాబుఈఓపీఆర్‌డీ హరియాద్, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ట్రాన్స్‌కో ఏఈ వీరారెడ్డి, మండల ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మెయిన్స్ పరీక్షల తేదీలు ప్రకటించాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల మెయిన్స్ పరీక్షల తేదీలను వెంటనే ప్రకటించాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, సీపీఎం నాయకుడు శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ 2022 నవంబర్ 28న 6,100 పోలీస్ కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ప్రిలిమ్స్ పరీక్షకు 4.52 లక్షల మంది అభ్యర్థులు హాజరవ్వగా 92వేల మంది అర్హత సాధించారన్నారు. రెండేళ్ల తర్వాత ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించారని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

చాపాడు: తమ కాలేజీలో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ ఉద్యోగాలలో స్థిరపడి ఉన్నత స్థాయికి ఎదగాలని సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో శనివారం బీటెక్‌లో ఈఈఈ, ఈసీఈ విభాగాల్లో చదువు పూర్తి చేసుకున్న పూర్వపు విద్యార్థులతో అలుమ్ని మీట్ నిర్వహించారు.

పోక్సో చట్టంపై అవగాహన

ప్రొద్దుటూరు క్రైం : పోక్సో చట్టం గురించి విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఆర్.హారిక తెలిపారు. శనివారం పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్–2ను జూనియర్ సివిల్ జడ్జి తనిఖీ చేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి జడ్జి వివరించారు.

భూ కబ్జాకు పాల్పడలేదు



మాట్లాడుతున్న వల్లూరు నాగేంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : కల్లూరు గ్రామంలో తాను భూ కబ్జాకు పాల్పడలేదని కల్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు వల్లూరు నాగేంద్రారెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లూరు గ్రామంలో తాను ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకున్నానని, ఇతరుల భూములను ఆక్రమించానని వస్తున్న ఆరోపణలను ఖండించారు. 1981లో రెవెన్యూ అధికారులకు నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు భూ సేకరణ ప్రక్రియ చేపట్టారన్నారు. ఇందు కోసం సేకరించిన భూమితోపాటు 88 సెంట్ల ప్రైవేట్ భూమిని కూడా 1981లోనే రెవెన్యూ అధికారులు ఆర్ఎస్ఆర్‌లో చేర్చారన్నారు. అందువలనే పట్టా భూమి రిజిస్టర్ కాకుండా నిలిచిపోయిందని తెలిపారు. సర్వే నంబర్ 744/1లో 88 సెంట్లు భూమి ఉందని తెలిపారు. గెజిట్ ప్రకారం 9.98 ఎకరాల భూమిని అధికారులు సేకరించారన్నారు. అందులో 88 సెంట్ల భూమిని పొరపాటున ఎక్కించడం వలన ప్రస్తుతం సమస్య ఏర్పడిందన్నారు. భూముల యజమానులు ఏనుగుల చెన్న కృష్ణారెడ్డి, పాపయ్య కుమార్తెలు వెంకటరత్నమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టిస్తే అక్రమ కేసులా?

మైదుకూరు : రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టించినందుకు తమపై అక్రమ కేసులను బనాయించారని మైదుకూరు మున్సిపాలిటీకి చెందిన ఏపీ మహేష్, పాశం సుధాకర్, పసల వినోద్ కుమార్, మిద్దె నరేంద్ర శనివారం విలేకరుల ఎదుట వాపోయారు. మైదుకూరు నుంచి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని ఈనెల 8వ తేదీన తాము అధికారులకు సమాచారం అందించి బద్వేలులో పట్టించామని తెలిపారు. అయితే మైదుకూరులో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్న రైస్ మిల్లుల యజమానులైన సూరిశెట్టి ప్రసాద్, మాచనూరు సుబ్బరాయుడు ఈనెల 25న బ్రహ్మంగారిమఠం పోలీస్‌స్టేషన్‌లో తమపై తప్పుడు ఫిర్యాదు చేయించారని, విచారణ పేరుతో పోలీసులు చిత్రహింసలు పెట్టారని వాపోయారు.

నరాల రామారెడ్డికి ఉగాది పురస్కారం

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన ప్రముఖ అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డికి శ్రీసిటీ శ్రీవాణి ఆధ్యాత్మిక సాహితీ వేదిక వారు ఉగాది పురస్కారాన్ని అందించారు. శనివారం శ్రీసిటీలో పురస్కారం ప్రదానం చేశారు.

ఘనంగా అగస్త్యేశ్వరుడికి భస్మార్చన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం అమావాస్య సందర్భంగా స్వామికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు. స్వామివారికి వేద పండితులు ప్రదోష కాల సమయంలో పంచామృతాభిషేకం నిర్వహించారు.

ఉద్యోగాలకు ఎంపిక

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. కొప్పర్తికి చెందిన ఏఐఎల్ డిక్సన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అసెంబ్లీ ఆపరేటర్, ఆపరేటర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, శనివారం తెలిపారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన ప్రముఖ కంపెనీ ఫాక్స్‌కాన్ ప్రై వేట్ లిమిటెడ్ ప్రాంగణ ఎంపికలను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామసుబ్బమ్మ తెలిపారు. కళాశాలలోని ఈసీఈ విభాగానికి చెందిన 35 మంది విద్యార్థినులు, ట్రిపుల్ ఈ విభాగానికి చెందిన 5 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు తెలిపారు.